క్లుప్తంగా

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: స్నేహితుడి అకాల మరణంతో స్పందించిన పూర్వ విద్యార్థులు.. అతడి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. మండల పరిధి తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బండి యాదగిరి గౌడ్ శనివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మృతుడి బాల్య మిత్రులందరూ.. యాదగిరి కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు. మిత్రుడి మరణం తమను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఘనంగా రామానుజ జయంతి


అలంకరణలో రామానుజ

కొడంగల్: పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రామానుజ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. అర్చకులు ఆలయ ప్రదక్షిణ చేసి పట్టు వస్త్రాలు, పూలమాలలు రామానుజ జీయర్‌స్వామి మూలమూర్తికి సమర్పించి, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సీతారామాంజనేయ దేవాలయంలో పూజలు


చీపునుంతల్లో హోమం చేస్తున్న పూజారులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవలయంలో, గణపతి, సుబ్రహ్మణ్య శివ, నంది, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు, గుజస్తంభం, శిఖరాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆలయంలో మండల పూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య హోమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటయ్య, కార్యదర్శి బత్తుల బాల కుమార్ గౌడ్, నరసింహారెడ్డి, నాగేశ్వర్, రాకేశ్, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ముస్తాబు


అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎత్మార్‌పల్లి గ్రామాల్లో అధికారులు యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి ముస్తాబు చేశారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ఆకర్షించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద స్వాగత బోర్డులతో పాటు పచ్చని మామిడితోరణాలు, పూలమాలలు వేసి బెలూన్‌లతో ఓటర్లను ఆకర్షించే విధంగా ముస్తాబు చేశారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, హిమాయత్‌నగర్‌లో సంధ్య, ఎత్మార్‌పల్లిలో శివ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను ఓటర్లు ఆకర్షించే విధంగా తయారుచేశారు. అధికారుల సూచనల మేరకు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని రాజేంద్రనగర్ కళాశాలకు మొదటి ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441956233, 7032713785 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాటా 18, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 35, దొండ 28, చిక్కుడు 55, గోకర 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 47, ఆలు 33, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 25, చామగడ్డ 50. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.


అనంతగిరి: పోలింగ్ సామగ్రితో సిబ్బంది


అనంతగిరి: వికారాబాద్‌లో ఎన్నికల సిబ్బంది, సామగ్రిని గ్రామాలకు తరలిస్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన ఏఆర్‌ఓ, అడిషనల్ కలెక్టర్

ఓటు వజ్రాయుధం

- ప్రలోభాలకు లోనుకావొద్దు
- స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోండి: అధికారులు
- నేడు లోక్‌సభ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధమయింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పోలింగ్‌కు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు ఎన్నికల సామగ్రితో సిబ్బంది గ్రామాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడారు. 'ఓటు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు. అది వజ్రాయుధం లాంటింది. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ హక్కును వినియోగించుకోండి' అని కోరారు.

అనంతగిరి: పండుగ వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ కోరారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆది వారం వికారాబాద్‌లోని మేరినాట్స్ పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు తరలి వెళ్లారు. కాగా సామగ్రి పంపిణీ ప్రక్రియను ఏఆర్‌ఓ దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సిబ్బందిని బస్సుల్లో ఎక్కించి ఆల్‌దిబెస్ట్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికలు సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఐదు మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 144 సెక్షన్ ఉన్నందున ప్రజలు గుమికూడవద్దని సూచించారు.

మర్పల్లిలో 58 పోలింగ్ కేంద్రాలు

మర్పల్లి: చెవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని మర్పల్లి తహసీల్దార్ గణేశ్ తెలిపారు. మండల పరిధి 27 గ్రామ పంచాయతీలు, మరో 8 అనుబంధ గ్రామాల్లో మొత్తం 44,610 మంది ఓటర్లకు గాను.. 58 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారి వెల్లడించారు. సుమారు 295 సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. దివ్యాంగ ఓటర్లకు ఆటో సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాస్ కేంద్రం ఏర్పాటు చేసి, తగిన ఏర్పాట్లు చేయించామని తెలిపారు.

మోమిన్‌పేటలో.. 48

మోమిన్‌పేట: పార్లమెంటు ఎన్నికల్లో మండల పరిధి 28గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన 48 పోలింగ్ కేంద్రాల్లో 38,106(పురుషులు 18,779, మహిళలు 19,327) మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశా రు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు.

దోమలో.. 45

దోమ: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మహేశ్ బాబు అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి 36 గ్రామపంచాయతీలకు గాను.. 45 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఓటింగ్ యంత్రాలతో సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించనట్లు తెలిపారు. ఇందులో ఎంపీఓ సోమలింగం తదితరులు ఉన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. పోలింగ్ నిర్వహణకు ఓటింగ్ యంత్రాలతో సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. కుల్కచర్లలో 47, చౌడాపూర్‌లో 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

బంట్వారంలో.. 24

బంట్వారం: పార్లమెంటు ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 24 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా.. 17,150 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోనున్నారు. కోట్‌పల్లి మండలంలో 26 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 20,909 మంది ఓటు వేయనున్నారు. ఇదిలా ఉండగా.. పోలింగ్ సెంటర్లలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, ఆశాజ్యోతి తెలిపారు.

ధారూరులో.. 47

ధారూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలాన్ని 6 రూట్లుగా చేసి, వాటికి సెక్టోరియల్ ఆఫీసర్లుగా సర్పించు, షఫీఉల్లా, రూప్సీలక్ష్మి, సంజూరాథోడ్, శర్వలింగం, వరప్రసాద్‌లను నియమించారు. మండలంలో 47 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా.. వాటిల్లో 35,593 (పురుషులు 17,526, మహిళలు 18,067) మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోనున్నారు. 47 పోలింగ్ బూత్‌ల్లో ధారూరులో మహిళా బూత్, చింతకుంటలో కామన్ బూత్‌ను మోడల్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.


మర్పల్లి: చంటిబిడ్డతో వచ్చి సామగ్రి తీసుకెళ్తున్న మహిళా ఉద్యోగి


వికారాబాద్: సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది


మోమిన్‌పేటకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది


కుల్కచర్ల: అడవివెంకటాపూర్ గ్రామంలో ఈవీఎంలతో సిబ్బంది

సేవాలాల్ మహరాజ్ గొప్ప మార్గదర్శకుడు

కొత్తూరు: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ సమాజానికి గొప్ప మార్గదర్శకుడని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లాపూర్ గుడితండాలో ఆదివారం నిర్వహించిన సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం, దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్థానిక గిరిజన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీతో పాటు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, రవి నాయక్, దయానంద్‌గుప్తా, దశరథ్‌నాయక్, నర్సింహారెడ్డి, మోడీ దర్శన్, మల్లేశ్, జయేందర్‌రెడ్డి, శ్రీరాములు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొయినాబాద్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధి నాగిరెడ్డిగూడ, చిలుకూరు, చందానగర్, పెద్దమంగళారం గ్రామాల్లోని కేంద్రాల్లో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన యూత్ మోడల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

భారీ బందోబస్తు

మైలార్‌దేవ్‌పల్లి: ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధి పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ బూత్‌లతో పాటు పరిసరాల్లో 144 సెక్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, అక్కడ సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు అదనంగా పోలీసులను నియమించామని తెలిపారు. ఎక్కడైనా ఎలాంటి ఘటన జరిగిన నిమిషాల వ్యవధిలో చేరుకునేలా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామని, అలాగే రౌడీషీటర్లను ఇప్పటికే బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

నిర్భయంగా..

అత్తాపూర్: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ పరిధిలోని జడ్‌పీహెచ్‌ఎస్ అత్తాపూర్ గురునానక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం స్థానిక పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తమకు నచ్చిన అభ్యర్థులను ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు.

తల్లి ప్రేమ అమూల్యమైనది

ఎల్ఎఫ్ ఆరోగ్య యోగా సెంటర్ చైర్‌పర్సన్

మొయినాబాద్‌రూరల్: లోకంలో అత్యంత అమూల్యమైనది తల్లి ప్రేమ అని ఎల్ఎఫ్ ఆరోగ్య యోగా సెంటర్ చైర్‌పర్సన్ భారతి అన్నారు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా అజీజ్‌నగర్‌లో గల యోగా సెంటర్‌లో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కన్నబిడ్డల భవిష్యత్ కోసం నిత్యం శ్రమిస్తూ వారి కళ్లల్లో ఆనందాన్ని చూసేదే తల్లి అన్నారు. అనంతరం యోగా కేంద్రంలో కేక్‌కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస్, సభ్యులు సుధాకర్, లక్ష్మిప్రసన్న, శ్రవంతి, భవ్య, వరలక్ష్మి, వీరాచారి, అమ్దాపూర్ నాగేశ్, మాణిక్యం, బంగాలిగూడ అశోక్, వివిధ గ్రామాల మహిళలు, యువకులు పాల్గొన్నారు.

శివసాయి క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


పూజల్లో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు, భక్తులు

రాయదుర్గం: వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య చండీహోమం, రుద్రహోమం, గణపతి హోమం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో మూడవ రోజైన శనివారం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రామసాయిస్థూపం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు, ఆలయ నిర్వాహకుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కాశీవిశ్వేశ్వర స్వామి, షిర్డీ సాయిబాబా, అన్నపూర్ణాదేవి, గణపతి, అంజనేయస్వామి, ధన్వంతరి స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

పూర్తి కావచ్చిన బ్రిడ్జి పనులు

- రాంనుంతల, పెద్ద తండాల మధ్య నిర్మాణం
- రూ. 1.10 కోట్లతో పనులు
- తీరనున్న గిరిజనుల ఇబ్బందులు


రాంనుంతల-పెద్దతండా మధ్య నిర్మించిన బ్రిడ్జి

ఆమనగల్లు: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామం నుంచి పెద్ద తండా మధ్యలో వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. సుమారు రెండు, మూడు దశాబ్దాలుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న గిరిజనుల కల త్వరలో నెరవేరనుంది. వంతెన అసంపూర్తి పనుల కోసం మరో రూ.20 లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అదనపు నిధులు మంజూరైతే మిగిలిన పనులు పూర్తిచేసి బ్రిడ్జిని అందుబాటులోకి తేనున్నారు. దీంతో గిరిజనుల ఇబ్బందులు తొలగనున్నాయి.

వాగు పారితే రాకపోకలు బంద్..

రాంనుంతల గ్రామం నుంచి పెద్దతండా మధ్యలో వర్షాకాలంలో వాగు ప్రవహిస్తుంటుంది. కాలువ పారే సమయంలో రాంనుంతల, పెద్దతండాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కోనాపూర్ మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఈ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా గిరిజనులు కోరుతున్నారు. గతంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న రాంనుంతల గేటు నుంచి చిన్నతండా, పెద్దతండాల మీదుగా రాంనుంతల వరకు బీటీరోడ్డు నిర్మాణంతో పాటు బ్రిడ్జి నిర్మించాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. గత ఐదేళ్ల క్రితం రూ.1.10 కోట్లు మంజూరు కాగా కేవలం బీటీరోడ్డు నిర్మించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు.

నిధులు మంజూరు...

రాంనుంతల–పెద్దతండాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.10 కోట్లు ఎఫ్‌డీఆర్ నిధుల కింద ప్రభుత్వం గత ఏడాది నిధులను మంజూరు చేసింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ.. ఇరువైపులా సీసీ రోడ్డు, రివిట్‌మెంట్ తదితర పనులు చేయడానికి నిధులు లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. అసంపూర్తి పనులకు గాను రూ.20లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైతే వెంటనే పనులు పూర్తి చేసి బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.

లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి

- నిరుపయోగంగా పల్లె దవాఖాన
- ఏడాది క్రితమే భవన నిర్మాణం పూర్తి
- కరెంటు కనెక్షన్ లేదనే సాకుతో ప్రారంభించని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నిరుపయోగంగా పల్లె దవాఖాన భవనం

మొయినాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పల్లె దవాఖానాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదనే సాకుతో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో సంవత్సర కాలంగా ఆ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. ఉన్నతాధికారులు స్పందించి భవనాన్ని త్వరగా ప్రారంభించి, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

లక్షణంగా వదిలేసి..

మండల పరిధిలోని చిలుకూరులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఉంది. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఓ చిన్న గదిలో సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్‌సెంటర్‌కు కొత్త భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. చిలుకూరు బస్టాప్ పక్కనే విశాలమైన ప్రదేశంలో రూ.10లక్షలతో సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది పూర్తయింది. కానీ ఇప్పటివరకు దానిని ప్రారంభించడం లేదు.

నిర్మాణం పూర్తయినా..

చిలుకూరులో పల్లె దవాఖాన పేరుతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదని.. అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణం పూర్తయినా అందులో కరెంటు ఫిట్టింగ్ జరగలేదు. ఈ కారణంగానే భవనాన్ని ప్రారంభించలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఆరునెలల క్రితం జిల్లా వైద్యాధికారి ఆ భవనాన్ని పరిశీలించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు దానిని పట్టించుకోలేదు. దీంతో రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోకుండా.. ప్రజలకు అందుబాటులోకి రాకుండా ఉంది. ఇప్పుడు రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వమైనా దీన్ని పట్టించుకుంటుందా అని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై మండల వైద్యాధికారిణి వాణిని వివరణ కోరగా.. మొయినాబాద్ చిలుకూరులో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం దాదాపుగా పూర్తయింది. కానీ కాంట్రాక్టర్ భవనాన్ని మాకు అప్పగించలేదు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు. అవి పూర్తిచేసి మాకు అప్పగిస్తే అందులోనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు

ఘనంగా శంకర్‌జీ జయంతి


నివాళులర్పిస్తున్న వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, సురేందర్‌జీ, హన్మంతరావు

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకుడు దివంగత శంకర్‌జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎగ్జిబిషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి సొసైటీ ప్రతినిధులు వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, హన్మంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి, సమాజ అభ్యున్నతికి శంకర్‌జీ చేసిన సేవలు వారు కొనియాడారు.

ఓటు.. పాట్లు

స్వగ్రామాలకు వెళ్లే వారికి తప్పని తిప్పలు


చేవెళ్ల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ


మొయినాబాద్: బస్సులో కిక్కిరిసి ఎక్కుతున్న ప్రయాణికులు

చేవెళ్ల: ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంతూళ్లకు వెళ్లే ప్రజలకు పాట్లు తప్పలేదు. దీంతో ఆదివారం రోడ్లపై ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలన్నీ రద్దీగా కనిపించాయి. చేవెళ్ల బస్టేషన్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు పెద్ద సంఖ్యలో కనిపించారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే బస్సులు రద్దీగా వస్తుండడంతో గంటల తరబడి బస్సుల కోసం వేచి చూశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వికారాబాద్, కొండగల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన ప్రజలు సోమవారం ఓట్లు వేసేందుకు స్వగ్రామాలకు బయలు దేరారు. దీంతో వారికి సరిపడా బస్సులు లేకపోవటంతో నానా అవస్థలు పడ్డారు. బస్సులు లేకపోవటంతో బస్టేషన్ బయటే ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, లారీలు, కార్లు ఆపి ప్రయాణం సాగించేందుకు ప్రయత్నించారు.

మొయినాబాద్: ఓటు హక్కు వినియోగించుకోవడానికి చాలా మంది సొంత ఊర్లకు ప్రయాణమయ్యారు. కొడంగల్, పరిగి, నారాయణ్‌పేట్ ప్రాంతాలకు చెందిన ప్రజలు మొయినాబాద్, కాశీమందిర్, నగరంలోని పలు ప్రాంతాల్లో ఉంటూ అడ్డా కూలీలుగా పనిచేస్తారు. వారంతా ఓటు వేయడం కోసం ఆదివారం తమ సొంతూర్లకు బయలుదేరారు. అయితే వారు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందిపడ్డారు.